

ప్రభుత్వ పథకాలపై అవగాహన : ఎంపిడిఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఎంపిడిఒ తాజ్ మస్రూర్ సూచించారు. శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయంలో ఏకీకృత కుటుంబ సర్వే, డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్, ఐవిఆర్ఎస్ కాల్స్, పెన్షన్స్ తదితర ప్రభుత్వ కార్యక్ర మాలపై డ్వాక్రా విఒలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ తాజ్ మస్రూర్, ఎపిఎం కిజర్ ఖాన్, గ్రామ సచివాలయాల పర్యవేక్షణ అధికారి తిరుపాల్‌నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ కార్య క్రమాలపై విఒలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల చెంతకు చేరవేయాలన్నారు. ఇందుకు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ రాజు, సిసిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాజమస్రూర్

చుక్కల భూముల సమస్యలపై స్పెషల్ డ్రైవ్

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని 22ఎ, చుక్కల భూముల సమస్యలపై స్పెషల్ డ్రైవ్ ప్రారంభించామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. పలు కారణాలవల్ల 22ఎ, చుక్కల భూములకు సంబంధించిన ఎన్‌ఒసిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్న విషయం తెలిసిందే. ఈ భూముల పరిష్కారానికి శుక్రవారం కలెక్టర్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించి జిల్లా యంత్రాంగానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 22.62 ఎకరాల భూములకు సంబంధించిన ఎన్‌ఒసిలను జారీ చేశామన్నారు. మదనపల్లి మండలానికి చెందిన శ్రీలత, భాస్కర్, కానాల చెంగమ్మ, హేమలత, నందకిషోర్, కురబలకోట మండలానికి చెందిన మస్తాన్‌రెడ్డిలకు ఈ సందర్భంగా ఎన్‌ఒసిలను జారీ చేశామని పేర్కొన్నారు. మరో 15.28 ఎకరాల భూములకు 22ఎకు సంబంధించిన 10 కేసులను విచారణ చేపట్టామని వీటికి సంబంధించిన ఎన్‌ఒసిలను సోమవారం జారీ చేస్తామన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 22ఎ, చుక్కల భూముల సమస్యలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని త్వరలో ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఈ పేర్కొన్నారు. రికార్డుల ఫోర్జరీ కేసులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్‌ఒసిలను పొందిన లబ్ధిదారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తమ 22ఎ భూముల సమస్యలు పరిష్కరించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, జిల్లా పాలన యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్‌ఒసి సర్టిఫికెట్ ఇస్తున్న మదనపల్లె సబ్ కలెక్టర్ లావణ్య, కలెక్టర్ నిశాంత్ కుమార్

నకిలీ మద్యం కేసులో కస్టడీకి ఐదుగురు నిందితులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఐదుగురు నిందితులను శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారు కేసులో నిందితులు జనార్ధన్‌రావు, శ్రీనివాసరావు, జగన్‌మోహన్, రమేష్, అష్రఫ్ అలీలను పోలీసు కస్టడీ తీసుకొని విచారణ చేపడుతున్నారు. వీరిని మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తొలుత నిందితులను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు అనంతరం ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు, సిట్ అధికారులు ఆధ్వర్యంలో నిందితులను విచారిస్తున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారు కేసు రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. పోలీసుల విచారణలో మద్యం తయారీ కేంద్రంలో పోలీసులకు లభించిన డైరీ, సెల్‌ఫోన్ కాల్ డేటా, నకిలీ మద్యం క్రయవిక్రయదారుల సంబంధించి వివరాల మేరకు 36 మంది నిందితులు ఉన్నట్టు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. వారిలో ఇప్పటికే 30 మందిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు, మిగిలిన వారి కోసం గాలింపులు చేస్తున్నారు. ఈ కేసును సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. బెల్టుషాప్‌లకు సరఫరా చేసిన వివరాలు, ప్రధాన నిందితుడు జనార్ధన్‌రావు, తంబళ్లపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి దాసరపల్లి జయచంద్రారెడ్డితో ఉన్న ఆర్థిక లావాదేవీలు పలు కీలక విషయాలపై విచారించినున్నట్లు తెలిసింది. కాగా జయచంద్రారెడ్డి ఇంకా పరారీలో ఉన్నాడు. నకిలీ మద్యం కేసులో మొత్తం 33 మంది నిందితులు ఉండగా, ఇప్పటికే 25 మందికి కస్టడి విచారణ పూర్తి చేశారు. అయితే కేసులోని నిందితుల వద్ద స్టేట్ మెంట్లు తీసుకొన్న అనంతరం వారిని తిరిగి సబ్ జైలుకు తరలిస్తున్నారే తప్ప నకిలీ మద్యం కేసులో ఎవరెవరి పాత్ర ఎంత ఉందో అన్న సమాచారాన్ని కింది స్థాయి అధికారుల నుండి ఎక్సైజ్ కమిషనర్ వరకు బయట పెట్టక పోవడంతో కేసును నీరుగారుస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



నిందితులను కస్టడీకి తీసుకుంటున్న పోలీసులు

దేశం మరువని ధీరుడు ఉధమ్ సింగ్ : విసికె



ఉధమ్ సింగ్‌కు నివాళరిస్తున్న బాస్, విసికె నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశం మరువని ధీరుడు సర్దార్ ఉధమ్ సింగ్ అని విడుదలై చిరుతైగల్ కట్చి (విసికెపార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ కొనియాడారు. శుక్రవారం స్థానిక భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) కార్యాలయంలో సర్దార్ ఉధమ్ సింగ్ జయంతిని విసికె, బాస్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా బాస్, విసికె నాయకులు ఉధమ్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖమైనది, విషాదకరమైనది జలియన్‌వాలా బాగ్ హత్యాకాండ అని, దీనికి సూత్రదారి అయిన మైఖేల్ ఓ డయ్యర్‌ను కాల్చి చంపి, ప్రతీకారంగా తీర్చుకున్న గొప్ప యోధుడు సర్దార్ ఉధమ్ సింగ్ అని పేర్కొన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని సునామ్‌లో 1899 డిశంబర్ 26న జన్మించిన ఉధమ్ సింగ్, చిన్నతనం నుండే భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. 1919 ఏప్రిల్ 13న, పంజాబీ నూతన సంవత్సరం సందర్భంగా, భారత స్వాతంత్ర్య పోరాటం గురించి చర్చించుకునేందుకు, అమృత్‌సర్‌లోని జలియన్‌వాలా బాగ్‌లో ప్రజలు సమావేశం కాగా విషయం తెలుసుకున్న జనరల్ డయ్యర్ నిరాయుదులైన ప్రజలపైకి, బ్రిటిష్ సేనల్ని పంపి, వేలాది మందిపై తూటాల వర్షం కురిపించారన్నారు. భారత పౌరుల్ని కాల్చి చంపిన బ్రిటీష్ సైనికాధికారి మైఖేల్ ఓ డయ్యర్‌ను ఉధమ్ సింగ్ కాల్చి చంపి అక్కడే లొంగిపోయారని వివరించారు. భారత సమాజంలోని హిందూ, మొహమ్మదీయ, సిక్కు మతాలకు ఏకత్వాన్ని ఆపాదిస్తూ, ఉధమ్ సింగ్ తన పేరును రాం మొహమ్మద్ సింగ్ ఆజాద్‌గా మార్చుకున్నారని చెప్పారు. ఉధమ్ సింగ్ ధైర్యసాహసాలను, దేశభక్తిని, త్యాగాన్ని గుర్తించి, షహీద్-ఎ-అసద్ (వీరులలో అగ్రుడు) అని ఆనాటి సమాజం కీర్తించ్చిందని చెప్పారు. కార్యక్రమంలో బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, విసికె, బాస్ నాయకులు జి.వి.రమణ, బండకోట రవి, వై.గంగాధర్, బురుజు రెడ్డిప్రసాద్, తలారి కృష్ణ, జనార్ధన్, రాయల్ సూరీ, బడికాయలపల్లి నరసింహులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు 'సీమ'లోనే పెట్టాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



నిరసన తెలుపుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి-రాజంపేట

మైక్రోస్టాఫ్ట్ సిఇఒ సత్య నాదేళ్ల తాను పెట్టాలనుకున్న రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను రాయలసీమలోనే పెట్టాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ఏడుగురు వ్యక్తులు ముఖ్యమంత్రులయినప్పటికీ అక్కడ ఇంకా పేదరికం ఉందని, పరిశ్రమలు లేవని విమర్శించారు. మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు రాయలసీమలోనే పెట్టాలని కోరుతూ శుక్రవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్య నాదెళ్లను ఒప్పించి ఆ సంస్థ పెట్టుబడులు వచ్చేలా సిఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వకుండా రాజస్థాన్, ఢిల్లీ, ముంబయి ప్రాంత ప్రజలకు అవకాశాలు కల్పిస్తున్నారని విమర్శించారు. 1100 కిలోల బంగారం భక్తులు టిటిడికి ముడుపుల రూపంలో చెల్లిస్తే ఆ బంగారం ప్రస్తుతం ఎక్కడుందో, ఏ స్థితిలో ఉందో తెలియజేయకుండా టిటిడి గోప్యంగా ఉంచడం సబబు కాదని తెలిపారు. 50 కిలోల బంగారం మాయమైనట్లు ఇటీవలే సమాచారం అందినట్లు తెలిపారు. వారం రోజులలోపు టిటిడి ఆధీనంలో ఎంత బంగారం నిల్వలు ఉన్నాయో ఇఒ నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిటిడి భూములను ఒబేరాయ్ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడు తున్నారని, దీనివలన టిటిడి పర్యావరణ స్థితిగతులు దెబ్బ తింటాయని ఆవేదన చెందారు. విఐపి దర్శనాలు కొందరికే కట్టబెడుతున్నారని, టిడిపి, బిజెపి తప్ప ఇతర పార్టీలలో, ఇతర ప్రాంతాలలో శ్రీనివాసుడు భక్తులు లేరా అని ప్రశ్నించారు.

పత్తికొండ ఎస్ఐపై విచారణ జరపాలి

- నిరసనలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

కర్నూలు జిల్లా పత్తికొండ కోర్టులోనికి అక్రమంగా చొరబడి కోర్టు ఎదుట లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్న శివయ్య అనే నిందితుడిని పత్తికొండ, చిప్పగిరి ఎస్ఐలు విజయ్‌కుమార్, సతీష్‌కుమార్ అక్రమంగా అదుపులోకి తీసుకోవడానికి నిరసనగా న్యాయవాదులు రాయచోటి కోర్టు గేటు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐలను ఇద్దరిని సస్పెండ్ చేసి విచారణ జరిపించాలన్నారు. పోలీసుల హద్దులు దాటి ప్రవర్తించ కూడదన్నారు. కార్యనిర్వహక వ్యవస్థగా ఉన్న పోలీసులు న్యాయవ్యవస్థ పట్ల గౌరవం ఉంచకుండా కోర్టు ఎదుట లొంగిపోవడానికి కోర్టులో జడ్జి ఎదురుగా కూర్చుని ఉన్న నిందితుడిని ఎస్ఐలు దౌర్జన్యంగా కోర్టు లోనికి ప్రవేశించి ముద్దాయిని బలవంతంగా పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లడం కోర్టుదికారం కిందికి వస్తుందని న్యాయవ్యవస్థ పట్ల ఏమాత్రం గౌరవం ఉంచకుండా రౌడీలాగా ప్రవర్తించడం క్షమించగలరని నేరమని ప్రధాన కార్యదర్శి రెడ్డి బాషా అన్నారు. కార్యక్రమంలో ఐఎఎల్ కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్. టి.ఈశ్వర్, ఉపాధ్యక్షులు ఆర్.ఆనందకుమార్, న్యాయ వాదులు చిన్నయ్య, పి.రెడ్డయ్య, రమణ, నాగమణి, ఎం.నాగేశ్వరరావు, వీరభద్ర, వరలక్ష్మి, ఎం. రవి శంకర్, రమణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులు

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నిస్సార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పుంగనూరు నియోజకవర్గం ఈడిగపల్లి పర్యటనకు శుక్రవారం వచ్చిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. మదనపల్లె రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడం, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టడంలో నిస్సార్ అహమ్మద్ ప్రజలకు చేరువయ్యాడని ప్రశంసించారు. నిస్సార్ అహమ్మద్‌తోపాటు మాజీ ఎంపీ రెడెప్ప, నియోజకవర్గ పరిశీలకులు అనూష, సీనియర్ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, దండాల రవిచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాఘవ, ఈశ్వర్ నాయక్, యూనస్, మిలిటరీ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో ఎఒ నాగభూషణం

రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా నాగభూషణం

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ యూనిట్ రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికల గడువు ముగియడంతో 2025-2028 కాలానికి సంబంధించి కొత్త ఎపిఆర్ఎస్ఎ కలెక్టరేట్ యూనిట్ ఎన్నికలు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలలో ప్రెసిడెంట్‌గా కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి, సెక్రటరీగా సీనియర్ అసిస్టెంట్ పి.వంశీకృష్ణ, ఇతర పదవులకు సంబంధించిన అధికారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ ఫణికృష్ణ ఈ ఎన్నికలను సక్రమంగా నిర్వహించారు. ఎన్నికల అధికారిగా అన్నమయ్య జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.నరసింహ కుమార్ వ్యవహరించారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

మహమ్మద్ అబ్బాస్‌కు సత్కారం

ప్రజాశక్తి-రాయచోటి

డాక్టర్ షేక్ మహమ్మద్ అబ్బాస్ ఎన్‌టిఆర్ డెంటల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ నుండి గోల్డ్ మెడల్ సాధించినందుకు పిసిసి జనరల్ సెక్రటరీ షేక్ అల్లా బకాష్, మాజీ యువజన కాంగ్రెస్ నాయకుడు ఫయాజ్, మాజీ పట్టణ అధ్యక్షుడు ఫారుక్, జిల్లా సెక్రెటరీ ఆఫీజుల్లా, ఎస్ఎస్.బాషా, ఐయుఎంఎల్ డాక్టర్ సుహెల్, సాఫ్ట్వేర్ ఇంజినీర్ సుహేల్ పలువురు ప్రముఖులు పట్టణంలోని డాక్టర్ నివాసానికి వెళ్లి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అల్లా బకాష్ మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. రాయచోటి పట్టణంలో డెంటల్ ఆసుపత్రిని ప్రారంభిస్తే తమకు పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అబ్బాస్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

మునిసిపల్ పాలకవర్గ అత్యవసర సమావేశం ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ సభాభవనంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం హాజరవుతారన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొని పట్టణాభివృద్ధితో పాటు ప్రజా సమస్యలపై చర్చిస్తారన్నారు. సమావేశానికి అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు హాజరు కావాలని కోరారు.



నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న ఆర్‌జె.వెంకటేష్

బలహీన వర్గాలకు పెద్దపీట : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : టిడిపిలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యత ఉటుందని రాజంపేట పార్లమెంట్ మాజీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. రాజంపేట పార్లమెంట్ కమిటీలో మదనపల్లి, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి పార్టీ అధిష్టానం పలువురికి చోటు కల్పించింది. శుక్రవారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో కొత్తగా ఎంపికైన పార్లమెంట్ కమిటీ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి, పూలమాల, శాలువాలతో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్‌ఖాన్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు తలారిరాధ, పూస చంద్రమోహన్ రెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి విజయమ్మ, పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్ ఎం.శ్రీపతికు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త టీంకు రాజంపేట పార్లమెంటు పరిధిలో పార్టీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.ఏ ఎన్నికలైన, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ విజయం కోసం ఎమ్మెల్యే నాయకత్వంలో మీతో కలిసి పనిచేయడానికి సిద్ధమని వెల్లడించారు. పార్లమెంట్ కొత్త కమిటీలో మహిళలకు పెద్దపీట వేయడంతో పాటు పార్టీ కోసం విధేయులుగా సేవలు అందించిన వారికి అవకాశాలు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలుగు దేశం పార్టీ అంటేనే కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపునిచ్చే పార్టీ అని, బడుగు, బలహీన వర్గాల పార్టీగా ప్రజల మన్ననలు అందుకున్నదని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు రాటకొండ మధు బాబు, గండి కోట గణేష్, గోపాల్, రాజన్న, మల్లికార్జున, విద్యాసాగర్, ఉషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: కళాశాల అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు, వాటి ఖర్చులు, బిల్లులు, కమిటీ ఇతర వివరాలు సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం అడిగితే ఇంత వరకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన ప్రిన్సిపల్ కృష్ణవేణిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు ఉత్తన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఉత్తన్న విలేకరులతో మాట్లాడుతూ ప్రిన్సిపల్‌పై ఆర్‌జెడి, కమీషనర్లకు ఫిర్యాదు చేసి నట్లు తెలిపారు. కమీషనర్ కార్యాలయం నుంచి లెటర్ వచ్చిన పట్టిం చుకోకుండా ప్రిన్సిపల్ మాకు తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. చట్టం నిర్దేశించిన సమయంలో నేను దరఖాస్తు ద్వారా అడిగిన సమాచారం ఇవ్వకుండా తప్పు దోవ పట్టించిన ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజా, ఎరుకల మహిళా నాయకురాలు పి.వసంత, జనార్ధన్, అక్బర్, పృధ్వి పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: సంబేపల్లె మండలంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం నిర్వహించే ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లను శుక్రవారం టిడిపి నేత మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పరిశీ లించారు. 28న జరగనున్న ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వేదిక, భోజనాల ఏర్పాటు తదితరాలపై ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బ రాజు యాదవ్‌తో చర్చించారు. ఆలయ అభి వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం గదుల ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లి మండల నేత మదన్ మోహన్, నేతలు కిషోర్ చౌదరి, మాదం బసిరెడ్డి, ఈశ్వరయ్య, హేమంత్, కుమార్, హరిప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం : సిఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం: గుర్రంకొండ మండలంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని వాల్మీకిపురం సీఐ రాఘవ రెడ్డి అన్నారు. శుక్రవారం గుర్రంకొండ ప్రజలతో గ్రామ సభ నిర్వ హించి, సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100కు లేదా పోలీసుస్టేషన్‌కు సమా చారం అందించాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఒటిపిలు అడిగినా లింక్‌లపై క్లిక్ చేయమని చెప్పినా చేయకూడదని సూచించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహన యజమానిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పార్కింగ్ స్థలాల్లో వాహ నాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. రోడ్లపై బర్త్‌డే పార్టీలు చేసుకో వడం, బాణాసంచా పేల్చడం వంటి హంగామాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చ రించారు. కార్యక్రమంలో ఎస్ఐలు తిప్పేస్వామి, రవీంద్రబాబు పాల్గొన్నారు.



గుర్రంకొండలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ రాఘవరెడ్డి

జిల్లా కేంద్రం ప్రకటించే వరకూ పోరాటం : జెఎసి

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించే వరకు పోరాటం కొనసాగుతుందని జేఏసీ సభ్యులు స్పష్టం చేశారు. శుక్రవారం జెఎసి ఆధ్వర్యంలో బోయినపల్లిలోని 108 అడుగుల తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహం వద్ద రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని నిరసనలు తెలిపారు. అనంతరం అన్నమయ్య నీ ఖ్యాతిని నీవే నిలబెట్టుకోవాలయ్యా అంటూ అన్నమాచార్యుల విగ్రహానికి వినతి పత్రాలు సమర్పించారు. వందలాదిమంది చేరుకొని అన్నమయ్య పార్కు వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రం సాధనకు ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా తమ పదవులకు రాజీనామా చేసి రాజంపేట ప్రజల ఆకాంక్ష ప్రభుత్వానికి చేరవేసే విధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, టిడిపి మండల అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ బాధ్యులు పూల భాస్కర్, అపుస్మ అధ్యక్షులు అబ్బూరి ప్రభాకర్ నాయుడు, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత కొండూరు శరత్ కుమార్‌రాజు, ఫ్యూచర్ మైండ్స్ కరస్పాండెంట్ నందకిషోర్, రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ రవీంద్రనాయుడు, యల్లటూరు శివరామరాజు, సమ్మెట శివప్రసాద్, చిట్వేలి రవికుమార్, సికిందర్, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లాను సాధిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి స్పష్టం చేశారు. ఎజెఎసి ఆధ్వర్యంలో 21 రోజులుగా ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలలో శుక్రవారం వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, చారిత్రకంగా, భౌగోళికంగా, నైసర్గికంగా అన్ని అర్హతలు కలిగిన రాజంపేటను జిల్లా కేంద్రం చేయమని అడగడం తమ హక్కు అని తెలిపారు. ప్రతి పార్లమెంట్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంగా చేస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం రాజంపేటకు తీవ్ర ద్రోహం చేసిందని, ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పట్టణ నడిబొడ్డులో రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం కాకతీయ విద్యా సంస్థల అధినేత, మున్సిపల్ కౌన్సిలర్ పోలా రమణారెడ్డి దీక్షా శిబిరం వద్దకు చేరుకొని సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో నాయిని గిరిధర్, కిషోర్, సత్యాల హరి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జెఎసి సభ్యులు



వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ

ప్రజల చేతుల్లోనే ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల చేతుల్లోనే ప్రభుత్వ సేవలు అందుతు న్నాయని, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒ లక్ష్మీపతి తెలిపారు. శుక్రవారం రాచవేటివారిపల్లె సచివాలయాన్ని ఆయన సందర్శించారు. పంచాయతీ అభివృద్ధి అధికారి రజిత, సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామంలో ప్రభుత్వ వాట్సప్ గవర్నెన్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇకెవైసి కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రజలకు అవసరమైన వివిధ పౌర సేవలను మరింత సులభతరంగా, సమర్థవంతంగా అందించడానికి 9552300009 మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రజలు పౌరసేవరులకై ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా సమయాన్ని వృధా చేసుకోకుండా మనమిత్ర వాట్సాప్‌లో అవసరమైన పౌర సేవలను పొందాలన్నారు. మనమిత్ర వాట్సాప్‌లో అవసరమైన సేవలకు దరఖాస్తు చేసుకుంటే అధికారులే వాటిని పరిశీలించి ఆమోదం తెలపతారన్నారు. అనంతరం ప్రజలు వాట్సాప్ లోనే ఆమోదించిన ధ్రువ పత్రాలను పొందవచ్చని తెలియజేశారు. సచివాలయ ఉద్యోగులు కూడా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజిత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రి బహిరంగ సభకు తరలిరండి : టిడిపి

ప్రజాశక్తి-రామాపురం

రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు హాజరై సభను విజయవంతం చేయాలని టిడిపి యువ నాయకుడు ఎం.చెన్నకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం నిర్వహించే బోయే బహిరంగ సభకు టిడిపి నాయకులు, అనుబంధ సం ఘాలైన ఐటిడిపి, టిఎన్ఎస్ఎఫ్, ఎస్‌సి,ఎస్‌టి,బిసి విభాగాల నాయకులు, మహిళా విభాగం నాయకులు, రైతు విభాగం, ట్రేడ్ యూనియన్, ఉద్యోగ సంఘం నాయ కులు, ప్రజలు మహిళలు విరివిగా పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

అందరి సహకారంతోనే నేరాల నియంత్రణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో నేరాల నియంత్రణకు అందరూ సహకరించాలని ఎస్ఐ అనిల్‌కుమార్ కోరారు. ఎస్ఐని పలువురు కూటమి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో తంబళ్లపల్లెను జిల్లాలో అగ్రగామిగా నిలుపుదామన్నారు. ఎస్ఐని కలిసిన వారిలో డేరంగుల చంద్ర, సోమశేఖర్, జగదీశ్, ఉత్తంరెడ్డి, పురు షోత్తం, రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి, రామచంద్ర, కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు.

నేడు చేపల చెరువులకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చేపల ఫలసాయానికై శనివారం రాచవేటివారిపల్లె పంచాయతీలోని చెరువులకు బహిరంగ వేలంపాటను ఎంపిడిఒ , డిప్యూటీ ఎంపిడిఒ అధ్యక్షతన స్థానిక సర్పంచు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాచవేటివారిపల్లె పంచాయతీలోని చెరువులు ఇటీవల కురిసిన వర్షాలకు నిండడంతో చేపల ఫల సాయానికై శనివారం బహిరంగ వేలంపాటను స్థానిక సచివాలయం వద్ద ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా ప్రభుత్వం నిర్ణయించిన డిపాజిట్ రుసుం కట్టి వేలంపాటలో పాల్గొనాలని కోరారు. డిపాజిట్ దారులు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని పేర్కొన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చుపాట మొత్తాన్ని పాటాదారుడు చెల్లించి తగిన రసీదు పొందాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



పాఠశాలకు ప్రింటర్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని కన్నె మడుగు జడ్‌పి ఉన్నత పాఠశాలలో 1979-80 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల గోపాల్ రెడ్డి, నాగరాజు, అప్పిరెడ్డి ధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాలలను గత స్మృతులను తలుచుకొని నెమరు వేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయంగా విద్యార్థులకు ఉపయోగకరమైన రూ. 22వేలు విలువచేసే జిరాక్స్, ప్రింటర్, కనెక్టర్ల ను అందించారు. పూర్వ విద్యార్థుల దాతృత్వాన్ని హెచ్ఎం మద న్మోహన్, ఉపాధ్యాయులు, అభినం దించారు.

సమస్యల పరిష్కారం కోసమే కరెంటోళ్ళ జనబాట

- ఎపిఎస్‌పిడిసిఎల్ సిజిఎం జానకీరామ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిం చడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించడమే కరెంటోళ్ళ జన బాట కార్యక్రమ ప్రథమ లక్ష్యమని ఎపిఎస్‌పిడిసిఎల్ హెచ్ఆర్‌డి జానకీరామ్ తెలిపారు. రాష్ట్ర ప్రభు త్వం ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలో ఎపిఎస్‌పిడిసిఎల్ మదనపల్లి డివిజన్ డిఇఇ గంగాధరం, నిమ్మనపల్లి ఎఇ నాగరాజు, విద్యుత్ సిబ్బందితో కలిసి బాలి నాయునిపల్లెలో ఇంటింటికీ వెళ్లి విద్యుత్ వినియోగదారుల సమస్యలు స్వ యంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సర ఫరాలో అంతరాయం, విద్యుత్ కనెక్షన్ సమస్యలు, బిల్లుల వివాదాలు, విద్యుత్ భద్రత, ప్రమాదాల నివారణ, డిజిటల్ చెల్లింపులు వంటి అంశాలపై ప్రజలకు, రైతు లకు అవగాహన కల్పిస్తూ, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లా డుతూ గ్రామంలో విద్యుత్ కనెక్షన్, విద్యుత్ భద్రత, ప్రమాదాల నివారణ సమ స్యలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని చిన్నపాటి సమస్యలను గుర్తించామన్నారు. ఆ సమస్యలకు నిర్దేశిత గడువులోగా పరిష్కార మార్గం చూపించాలని అధికారులను ఆదేశించామన్నారు. వ్యవ సాయ భూముల్ని పరిశీలించి, విద్యుత్ వాడకంపై రైతులను అడిగి తెలుసు కున్నారు. పొలాల వద్ద స్టాటర్లు, ఎర్తింగ్ భద్రతకు తగిన జాగ్రత్తలు పాటిం చాలని రైతులకు సూచించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రతి మంగళ వారం, శుక్రవారం నిర్దేశిత గ్రామాలను పరిశీలించి 11 కెవి, ఎల్‌టి, వ్యవ సాయ విద్యుత్ లైన్ల పరిశీలన, కిందకు వేలాడే విద్యుత్ తీగలను సరి చేయడం,



గ్రామస్తుల నుంచి విద్యుత్ సమస్యలను తెలుసుకుంటున్న సిజిఎం

వాలిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి మార్పు చేస్తారని తెలిపారు. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెల ఎత్తును పెంచడం, లేదా ఫినిషింగ్ ఏర్పాటు చేయడం, పాఠశాలలు, అంగన్వాడీ ప్రాంగణాలపై ప్రత్యేక దృష్టి, విద్యుత్ సమస్యల గుర్తింపు, రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం, విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించాలన్నారు. నిరంతరం విద్యు త్ సిబ్బంది అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యుత్ అందించడమే కరెంటోళ్ళ జన బాట కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో డిఇఇ గంగా ధరం, ఎఇ నాగరాజు, లైన్ మేన్లు పూర్ణకుమార్, గోవిందరాజులు, అసిస్టెంట్ లైన్ మెన్లు నరసింహులు, షామీర్‌బాష, విద్యుత్ సిబ్బంది హర్షవర్ధన్, చలపతి పాల్గొన్నారు.

'మిట్స్'లో జాతీయ స్థాయి వర్క్‌షాప్



మాట్లాడుతున్న బాలకుమార్

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ లో ఎంసిఎ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయి ఆర్టికల్ ప్రెసెంటేషన్, పేపర్ పబ్లికేషన్స్ మేధో సంపత్తి హక్కుల ప్రాముఖ్యత అం శంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారని ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు రాష్ట్రం, తంజావూరులోని పెరియార్ మణియమ్మై ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్-రీసెర్చ్ ట్రైనింగ్ అండ్ పబ్లికేషన్స్ ప్రొఫెసర్ డాక్టర్ బాలాకుమార్ పిచాయ్, బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కుమారన్ షణ్ముగం, మిట్స్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, యూనివర్సిటీ అడ్వైజర్ డాక్టర్ ఆర్.తులసిరామ్‌నాయుడు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలాకుమార్ పిచాయ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యా ప్రయాణం ప్రారంభ దశ నుంచే పరిశోధన, రచనా నైపుణ్యాలు, విజ్ఞానాన్ని పంచుకునే ప్రక్రియలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వెబ్ ఆఫ్ సైన్స్, ఎస్‌సిఐ టైర్-1 జర్నల్స్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అత్యున్నత నాణ్యత గల పరిశోధనా పత్రికలని, వీటిలో ప్రచురితమైన పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో అధిక అకాడెమిక్ విలువ, విశ్వసనీయత ఉంటాయని తెలిపారు. ఇంపాక్ట్ ఫ్యాక్టర్ అనేది ఒక జర్నల్ ప్రభావాన్ని కొలిచే ముఖ్యమైన ప్రమాణమని వివరించారు. డాక్టర్ కుమారన్ షణ్ముగం మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల ప్రాముఖ్యత, పేటెంట్లు, కాపీరైట్స్, ట్రేడ్‌మార్క్స్, డిజైన్ హక్కులు వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఐపిఆర్‌కు సంబంధించిన చట్టపరమైన సమస్యలు, వివాదాలు, వాటి పరిష్కార విధానాలను నిజ జీవిత ఉదాహ రణలతో వివరించారు. ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (విపో) అందించే దూరవిద్య కోర్సుల ద్వారా లభించే అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లు, వాటి ప్రయోజనాలు, నమోదు విధానాలను కూడా వివరించారు. స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఐడియాలను ఎలా ప్రెజెంట్ చేయాలి, పరిశోధన ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా ఎలా మలచుకోవాలనే అంశాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ ఎన్. నవీన్‌కుమార్, డాక్టర్ ఆర్. కల్పనా, కో-ఆర్డినేటర్లు డాక్టర్ కె.రాధికా, డాక్టర్ కె.నిర్మలాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమ లక్ష్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారం కొరకు క ృషి చేశారు. స్థానిక నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని చమర్తి తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకముందు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను చమర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, టిడిపి నాయకులు శేషారెడ్డి, లువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జగన్‌మోహన్‌రాజు



పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి మహేంద్ర

ములకలచెరువు పోలీసుస్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర శుక్రవారం అకస్మింగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, కేసుల పరిష్కార విధానంపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి సిఐ, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అల్లర్లకు చోటులేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు.

పిఎంఇజిపి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కలికిరి :పిఎంఇజిపి రుణాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎం దేవసేన కోరారు. శుక్రవారం ఎపిఎం ఆధ్వర్యంలో మండల సమైక్య కార్యాలయంలో పిఎంఇజిపి సబ్సిడీ రుణాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రజలకు చిన్న కుటీర పరిశ్రమల ఏర్పాటు కొరకు పిఎంఇ జిపి లోన్లు 35శాతం సబ్సిడీతో కేంద్రం మంజూరు చేస్తుందన్నారు. ఆసక్తిగలవారు మండల సమైక్య కేంద్రంలో ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాసుబుక్ తీసుకుని రావాలని కోరారు.

29న నందలూరు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నందలూరు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన 29న ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.ఆర్.ఎమ్ ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు,సర్పంచ్‌లు, మండల ఉన్నతాధి కారులు హాజరు కావాలని కోరారు.

ములకలచెరువు ఎస్ఐగా ప్రతాప్

ప్రజాశక్తి-బి.కొత్తకోట



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ ప్రతాప్

ములకలచెరవు ఎస్ఐగా ఎం.ప్రతాప్ శుక్రవారం బాధ్యతలు స్వీక రించారు. ఈ సంద ర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరి రక్షణకు కృషి చేస్తామ న్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం విక్ర యాలపై దృష్టి సారిస్తా మన్నారు. ప్రజలకు హాని కలించే వారిపై ఉక్కుపాదం మోపు తామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. నూతన ఎస్ఐకు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రేపు మహిళలకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పీలేరు



మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

ఈనెల 28న మండలంలోని తలుపులలో మహిళల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ఎ.మాధవి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఉదయం వైద్య శిబిరం ప్రారంబమ వుతుందన్నారు. వైద్య శిబిరంలో సంతా నంలేని దంప తులకు గర్భాశయ సమస్యల్లో ప్రధానంగా రక్తస్రావం, తెల్లబట్ట, బహిష్టులవడం, అండాశయంలో గడ్డలు ఏర్పటడం,టూబ్స్‌లో సమస్యతో బాధపడే మహిళలకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లలు లేని దంపతులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాధవి ఆస్పత్రిలో పిల్లలు లేని దంపతులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం అంది స్తామని చెప్పారు. తమ దగ్గర అత్యాధునిక ఐయుఐ ల్యాబ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. మహిళలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మాధవి కోరారు.

వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన చారిత్రాత్మక నందలూరు శ్రీసౌమ్య నాథస్వామి ఆలయంలో ఈనెల 30న మంగళవారం వైకుంఠ ఏకాదశి కోసం భక్తులకుప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భ ంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ జనవరి 1న తెల్లవారు జామున 1.30 గంటల నుంచి స్వామి దర్శనం ప్రారంభ మవుతుందని తెలిపారు.ఉదయం స్వామి వారి కి లక్ష తులసి అర్చన, ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



సమగ్ర కుటుంబ సర్వేను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ

పక్కాగా సమగ్ర కుటుంబ సర్వే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం బండ్లపై గ్రామంలో ఆయన పర్యటించారు. సచి వాలయ ఉద్యోగులు చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టాలని దిశా నిర్దేశం చేసిందని అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత సులభతరంగా అందాలంటే ఈ సర్వే ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సర్వేలో కుటుంబంలోని వ్యక్తుల వ్యక్తిగత వివరాలు, విద్యా, ఉపాధి, సామాజిక వివరాలు, ఆస్తి, ఆదాయం వంటి సమాచారాన్ని క్షుణ్ణంగా సేకరించాలన్నారు. కుటుంబంలోని వ్యక్తుల నుంచి వారిచ్చిన సమాచారం పై ఈ -కేవైసీ చేయించుకోవాలన్నారు. ఎక్కడా కూడా ఎటువంటి తప్పులు లేకుండా ఈ సర్వేను చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజల కూడా ఎటువంటి అపోహలకు పోకుండా తమ వద్దకు వచ్చిన అధికారులకు సమగ్ర సమాచారాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేయాలని తెలిపారు. ఉన్నతాధికారులు సర్వేపై ఆకస్మిక తనిఖీలు చేపట్టవచ్చని, సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట మండలంలోని దేవరకొండ శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానము సమీపంలో గల శ్రీదేవరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ నిర్మాణ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. 27న ఉదయం 5 గంటల నుంచి పెనుశిల కోనకు ఏడవ మహా పాద యాత్ర జరుగుతుందని కావున భక్తులందరూ తప్పక పాల్గొని శ్రీస్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.



కళ్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

క్రైం కార్నర్

కారు, అంబులెన్స్ ఢీ

- ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని కేసాపురం రాయచోటి-మదనపల్లి రహదారిపై శుక్రవారం కారు, అంబులెన్స్ ఢీ కొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతి చెందిన వారిలో ప్రవళిక, శ్రీకాంత్‌గా గుర్తించారు.వీరు కారులో బెంగళూరు నుంచి కడపకు వస్తుండగా కడప నుంచి వెళుతున్న అంబులెన్స్ ఢీకొన్నట్లు తెలిపారు. మృతులు బద్వేలు, బ్రహ్మంగారిమఠం చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మృతుల పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉందని ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నమండెం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘ టన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేర కు.. బురకాయలకోటకు చెందిన వినోద్‌కుమార్‌రెడ్డి సొంత పనిపై ఇంటి నుంచి ద్విచ క్రవాహనంలో ములకలచెరువుకు బయలుదేరాడు. మార్గమ ధ్యంలోని తుమ్మ నగు ట్టవద్దకు రాగానే, ఎదురుగా వస్తున్న వాహనానికి సైడు ఇవ్వబోయి క్రమంలో అదు పుతప్పు బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాదితుడిని వెంటనే 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

నీటితొట్టిలో పడి నాలుగేళ్ల బాలుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నీటి తొట్టెలో పడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లి మండలంలో జరిగింది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా సోమలకు చెందిన జ్యోతిప్రకాష్ కుటుంబం గత రెండేళ్లుగా మదనపల్లె మండలం, వలసపల్లి వద్ద ఓ మామిడి తోటకు కాపలాగా ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న జ్యోతిప్రకాష్ కుమారుడు విక్రాంత్(4), సమీపంలో ఉన్న నీటి సంపులో పడి మృతి చెందాడు. బంగారం లాంటి మగ బిడ్డ నీటి తొట్టిలో పడి చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కారు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం మదనపల్లి మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వలసపల్లి కృష్ణాపురానికి చెందిన బొలెరో డ్రైవర్ దేవేంద్ర విధులకు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో మదనపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని నవోదయ స్కూల్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణాలు ఇప్పిస్తామని ఘరానా మోసం

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాధితురాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రూ.3వేలు కడితే 5లక్షల సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానని రాయచోటికి చెందిన ఫరీదా మోసం చేసిందని మదనపల్లెకు చెందిన బాధితురాలు శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. బాధితురాలి కథనం మేరకు.. రాయచోటికి చెందిన ఫరీదా సెంట్రల్ గవర్నమెంట్ ప్రోగ్రాం ఇన్‌ఛార్జినని స్థానిక రామారావు కాలనీకి చెందిన రూపతో రెండేళ్ల క్రితం పరిచయం చేసు కుంది. స్థానికంగా ఉన్న మహిళలకు రూ.5 లక్షల సబ్సిడీ లోన్లు ఇప్పిస్తానని నమ్మ బలికింది. రూప స్థానికంగా ఉన్న 207మంది వద్ద ఒక్కక్కరి నుంచి రూ.3వేలు కట్టించింది. అనంతరం ఫరీదా ముఖం చాటేసింది. రెండేళ్లయిన లోన్లు ఇవ్వక పోవడంతో రూ.3వేలు కట్టిన మహిళలు రూప ఇంటి వద్దకు వచ్చి నిలదీశారు. మోసం చేసిన మహిళపై రూప రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగక పోవడంతో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు పభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య అందిస్తున్నారు.